# పాంథశాల

"ఏమండీ! మా బాబాయిగారింటికి వెళ్ళొచ్చారా?" అంటుంది జానకి.

'ఓ' అంటాను నేను. అంటూ నా ముఖం ఆమెకు కనిపించకుండా వెన్ను చూపిస్తాను. 'వెన్ను చూపించడ' మన్న మాటలకు యుద్ధరంగంలో వేరే అర్థముంది. దానికి మా ఆవిడ సాన్నిధ్యంలో వున్న అర్థం యింకొకటి.

"నిజంగా? మా పిన్ని ఎలావుంది? వసంత ఏమందీ? నాగరాజు ఉద్యోగం మాట ఏమైంది?" అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తుంది జానకి. కురిపిస్తూ నా ఎదుట కొచ్చేస్తుంది.

సత్యపీఠంమీద నిల్చుంటే అబద్ధం చెప్పడం కుదరదంటారు. ఆ అనుభవమెలాంటిదో నాకు తెలియదు. కానీ మా ఆవిడ ముఖంకేసి చూస్తూ చూస్తూ అబద్ధం చెప్పగలగడమనేది - నాకు పెళ్ళయి పది పన్నెండేళ్ళయినా - యింకా సాధ్యం కావడం లేదు.

"మరి... చూడు జానకీ! నేను మరి..." అంటూ నీళ్ళు నములుతాను.

"అంతేలెండి! నాకు తెలియదా? మన బంధు ప్రేమల వైభోగం అంతలో వుంది! ఏంచేద్దాం! మా బాబాయిగారు బ్రతికున్న కాలంలోనైతే నేరుగా ఆఫీసుకే వెళ్ళి అయిదు నిమిషాల్లో పది నిమిషాల్లో మాటాడి, చక్కా బస్టాండుకు దూసుకునేవారు. ఇప్పుడదిగూడా లేకపోయింది... "నన్నిలా ముద్దాయినిగాజేసి, అపరాధపు బోనులో నిల్చోబెట్టి తాను న్యాయమూర్తిలా వ్యవహరించడంతో వూరుకోకుండా మళ్ళీ క్రాసు పరీక్షకుకూడా సిద్ధమౌతుంది మా ఆవిడ.

"మరైతే - నేను మొదట్లో మా బాబాయిగారింటికి వెళ్ళొచ్చారా అని అడిగితే 'ఓ' అన్నారెందుకండీ?

"అదా జానకీ! ఎందుకన్నానంటే... చెబుతున్నాగా వినిపించుకోకపోతే ఎలా..."

"ఒద్దు బాబూ ఒద్దు! నాకు తెలుసు! మీరేదైనా కథ చెబుతారు, కథలు చెప్పి లోకాన్ని మభ్యపెట్టడం మీ చేతనౌను. నా దగ్గర మీ పితలాటకాలు సాగవు..." ముఖం ముడుచుకుని, రుసరుస లాడుతూ దూరంగా వెళ్ళిపోతుంది మా ఆవిడ.

అంతేనండీ సంగతులు! మా జానకి సమక్షంలో నేను ప్రారంభించిన వాక్యానికి పూర్తయ్యే అదృష్టం సర్వసాధారణంగా సమకూరేదిగాదు.

'ఓ' అని ఎందుకన్నానో, అలాగనడం ఎంతవరకు సబబో - మా ఆవిడ వినిపించుకోకపోతే పోయింది. మీరైనా అవధరించండి!

❁ ❁ ❁ ❁

జానకి ఎవరినైతే బాబాయిగారుగా వ్యవహరిస్తుందో ఆయన తనకు బాబాయి మట్టుకేగాదు, నాకు మేనమామగూడా! నా కిద్దరు మేనమామలు. పెద్ద మామయ్య

మొదటి భార్య కొకేకూతురు జానకి. తండ్రి రెండో పెళ్ళి చేసుకున్న తర్వాత ఆ కుటుంబంలో జానకికున్న స్థానం పలచబడిపోతూ వచ్చింది. పెళ్ళయ్యాక సంగతి సరేసరి. మా పెద్ద మామయ్య ఒక దురదృష్టజీవి. ఆయన బడిపంతులుగా పనిచేశాడు. సంపాదించినదాంట్లో ఎక్కువభాగం నిలవచెయ్యాలనేది ఆయన ఆశ, ఆదర్శం. అవసరాలు సరిగ్గా తీరకపోవడంతో రెండో భార్య, ఆవిడ పిల్లలు ఆయన్ను ఆదినుంచీ విరోధి వర్గంలోని మనిషిగానే లెక్కగడుతూ వచ్చారు. ఆ యింటికి వెళ్తే ఏ క్షణాన్నయినా రగడ చెలరేగడానికి వీలున్న శత్రుగుడారాల మధ్యన వున్నట్టే వుండేది. మనుషుల్ని పీడించే దయ్యాలు ఎక్కడో వున్నాయనుకుంటాం! అశాంతి, అలజడి, అపనమ్మకాలకన్నా దెయ్యాలెక్కడున్నాయి? భగవంతుడు ప్రత్యక్షమై ఒక్కటే వరం కోరుకోమంటే మానవుడు రెండో ఆలోచన లేకుండా అన్యోన్య దాంపత్యాన్ని కోరుకోవాలనుకుంటాను. 'ఇది మా పెద్ద మామయ్యగారి దాంపత్యాన్ని చూచిన తర్వాత కలిగిన ఊహే అయివుండాలి. కాపురంలో భార్యా భర్త లొద్దికగా వుండకపోవడం మూలాన చెడిపోయేవాళ్ళు పిల్లలు. పిల్లలు చెడిపోవడమంటే భవిష్యత్తు పాడుగావడం. డబ్బిచ్చి పిల్లల్ని 'మ్యాట్నీ'కి పంపించి, చదువుకోడానికి వెళ్ళారని చెబుతుండేది తల్లి. సాయంకాలాల్లోనైనా యింటిపట్టున వుండి పిల్లల చదువుపట్ల శ్రద్ధ తీసుకోవలసిన తండ్రి విధిగా మఠంలో జరిగే వేదాంతోపన్యాసాలకు హాజరు. ప్రోగ్రెస్ కార్డులు యింటికొచ్చిన రోజున కుటుంబం నిప్పుల కుంపటి. "నీ ముదిగారం వల్లనే పిల్లలు చెడిపోతున్నా'రని ఇంటాయన ఆరోపణ. 'మీ నిరవాకంతో బాగుచేయలేకపోయారా' అని ఇంటావిడ ఫిర్యాదు. ఆ వుక్రోషంతో ఎప్పుడైనా చదువు చెప్పడానికని కూర్చుంటే మా పెద్ద మామయ్య చచ్చేది, బ్రతికేది తెలియకుండా పిల్లల్ని బాదేసేవాడు. 'అయ్యో, బిడ్డల్ని తన పొట్టన పెట్టుకున్నాడు గదమ్మా!' అంటూ అత్తయ్య శోకాలు తీసేది. మళ్ళీ యథాప్రకారంగా యింట్లో అరాచకం నెలకొనక తప్పేదిగాదు. ఇలా కాలం జరిగి జరిగి రిటయరయ్యే రోజులు దగ్గరికొచ్చేసరికి బిడ్డలకు చదువబ్బలేదన్న దిగులుతో యింకా యిద్దరు కూతుళ్ళు పెళ్ళిగాకుండా మిగిలే వున్నారన్న ఆందోళనతో మా మామయ్య తీరని అసంతృప్తికి గురయ్యాడు. చివరికా అసంతృప్తి ఒక జబ్బు రూపంలో ఆయన శరీరాన్నికూడా కృంగదీసింది. 'క్లోస్' గాకముందే కంటికి కనిపించకుండా పోయిన 'ఫైల్'లా ఆయన కాలగర్భంలో కలిసిపోయాడు.

ఎటొచ్చీ యిప్పుడు చెప్పబోతున్న కథకున్నూ, మా పెద్దమామయ్య జీవితానికిన్నీ అట్టే సంబంధంలేదు. లేదంటే - పరస్పర విరుద్ధమైన వాటిలో ఒకదాన్ని గురించి తెలుసుకుంటే, యింకొకటెలా వుంటుందో ఊహించడం సులువు. సంపాదించడమన్నది మా చిన్న మామయ్యను ఒక సమస్యలా ఎదుర్కోలేదు. సంపాదించినదాన్ని పదిలంగా దాచిపెట్టుకునే ఉపాయాలు ఆయనకు స్ఫురించి వుండకపోవచ్చునని ఎవరైనా చెబితే ఆ మాట మనం నమ్మొచ్చు. మైదాసురాజు ముట్టుకుంటే తిండీ నీళ్ళయినా బంగారంగా మారిపోయేవట! మా చిన్న మామయ్య కెదురైన కష్టం అంతకు తక్కువైనదేమీగాదు. ఆయనకే వస్తువులైతే కావలసివస్తాయో, అవి డబ్బుతో అవసరం లేకుండానే యింటికొచ్చి పడిపోతుండేవి. కిరాణా గిడ్డంగి ఆసామిని 'ఎలావున్నాయి మీ బేరసారాలు?' అని

పలుకరించడమే అపరాధం. మరునాటి సాయంకాలానికల్లా పప్పుదినుసులు, నూనె డబ్బాలు, సోపు మసాలా పొట్లాలు, బియ్యపు బస్తాలతోసహా యింటికొచ్చి వాలిపోయేవి. జవిళంగడి ప్రొప్రయిటర్ని 'చాలా రోజులైంది గదండీ కనిపించి' అని పరామర్శించడమే నేరం. ఇంట్లో ఎందరెందరున్నారో అందరికీ చెరొక వరస బట్టలు – పుట్టింటివారు ఉగాది సాంగ్యం నడిపినట్టుగా సరఫరా అయిపోయేవి. మా చిన్న మామయ్యను సమర్థించడానికని నేనొక క్రొత్త వాదాన్ని లేవదీస్తున్నానని మీరనుకుంటే నేనేమీ చెప్పలేనుగానీ, ఒక్కొక్కపుడు పరిస్థితులన్నీ కలసి మానవుడిపైన కుట్ర చేస్తాయనిపిస్తుంది. ఆయన ఎవణ్ణీ పలకరించడు. మరెవర్నీ పరామర్శించే పాపానికిపోడు. తలవంచుకుని తనపాటుకు తాను వెళ్ళిపోతాడు. ఈ మూకీభావం గూడా మరింత గడ్డుచిక్కుకే దారితీసేది. 'ఆఫీసరుగారెందుకో మనపైన పీకలదాకా కోపంగా వున్నార్రోయ్' అన్న అనుమానం వాళ్ళను తొలుచుకతినేదేమో! వినాయకుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకోవాలంటే రకరకాల పళ్ళు తీసుకరావాలి. ఉండ్రాళ్ళు చేసిపెట్టాలి. పాయసం నైవేద్యమివ్వాలి. ఇలాంటి ఆనవాయితీలన్నీ వాళ్ళకు కొట్టినపిండే! జవాన్లద్వారా కొన్ని, దొడ్డి గుమ్మంగుండా కొన్ని, చీకటిపడ్డాక కొన్ని – యిలా అత్యవసరమైన వాటితోబాటుగా, హంగుగా మాత్రమే పనికొచ్చే వస్తువులు గూడా తమకే కాళ్ళొచ్చి నడిచి వచ్చినట్టుగా ఆ యిల్లు చేరుకునేవి. మా కమలమ్మత్తకయినా ఆదిలో కాస్తా జంకూ, గొంకూ వుండేదేమో! నీళ్ళొచ్చినకొద్దీ చెరువు మునకలో పొలాలు మరుగుపడిపోయినట్టుగా కాలక్రమంలో ఆ జంకుగొంకులు మాసిపోతూ వచ్చాయి. వాళ్ళున్నది యివ్వడానికే, తామున్నది పుచ్చుకోడానికేనన్న ధీమా, నిండిన చెరువులో నాచులా ఆమెలో బలిసిపోతూ వచ్చింది. ఎంత పెద్ద కానుకనైనా సరే, చిన్ని చిరునవ్వయినా లేకుండా స్వీకరించడం ఆఫీసరుగారి భార్యకుండాల్సిన ప్రాథమిక లక్షణం. మా చిన్న మామయ్యకు ఆఫీసరుగా ప్రమోషను వచ్చేరాక మునుపే, కమలమ్మత్తకు ఆ లక్షణం పట్టుబడింది.

అన్నట్టు మా చిన్న మామయ్య పేరు రంగనాథం!

అనుకూల దాంపత్యమనేది భగవంతుడి అనుగ్రహంవల్ల లభ్యమయ్యేదైతే, ఆ వరం మా రంగనాథం మామయ్యపైకి యిబ్బడి ముబ్బడిగా ప్రసరించిందని చెప్పాలి. ఒక్క బాహ్య వ్యవహారాల శాఖను మాత్రమే భర్తకు కేటాయించి, గృహరాజ్యానికి సంబంధించిన మిగిలిన సమస్త శాఖల్నీ కమలమ్మత్త తన ఆధీనంలో వుంచేసుకుంది. పిల్లల చదువును గురించిగానీ, ఆరోగ్యాన్ని గురించిగానీ బెంగపెట్టుకోవలసిన అవసరం లేకపోవడంతో మామయ్యకు కావలసినంత స్వేచ్ఛ సమకూరినట్టయింది. వరుసగా బిడ్డల పేర్లు చెప్పమంటే ఆయన చెప్పగలిగేవాడే! కానీ ఆ బిడ్డలు ఏయే క్లాసుల్లో వున్నారో ఆయనకు తెలిసివుండదు. అట్లాగే ఏ బిడ్డ ఏ వూళ్ళో పుట్టిందని అడిగినప్పుడు ఆయన బిక్కరించేవాడు. జీవితాన్ని ఒక వినోదయాత్రగా తీసుకుని వీలయినంతలో ఏ సుఖంనుంచిగానీ వంచితుడు గాకుండా వుండాలన్నది ఆయన ఆశయం. రాత్రుల్లో ఏ పదకొండుకో, పన్నెండుకో ఆయన యింటికొచ్చేవాడు. కాంపుకు వెళ్ళిపోతే రెండు మూడు రోజులదాకా యింటికి రాకుండా వుండిపోవడం కద్దు. హైదరాబాదుకని బయల్దేరితే

మళ్ళీ తిరిగిరావడమెప్పుడో ఆయనకైనా తెలిసేదిగాదు. ఆయన ఎప్పుడెప్పుడు, ఎక్కడెక్కడ, ఎలాంటెలాంటి వ్యాసంగాల్లో నిమగ్నుడై వుంటాడన్న ధ్యాస మా కమలమ్మత్తకు లేకపోయిందని మాత్రం మనమిక్కడ ఒప్పుకోవాలి. కమలమ్మత్తకు నీతిపట్ల చాలా పట్టింపులున్నాయి. పనిమనిషి ఒకతె మొగుణ్ణి వదిలిపెట్టి మరొకడితో లేచివచ్చిందని తెలియడంతో ఆమె వున్నపాటున దాన్ని పనినుంచే తొలగించింది. కూరగాయల బేరంలో కమీషన్ కొట్టాడన్న కారణంపైన ఒక జవాను మళ్ళీ యింట్లో అడుగుపెట్టే అవకాశం లేకుండా దేవిడీమన్నా చేసింది. క్రమశిక్షణ విషయంలో ఆమె మాట తిరుగులేని శాసనం. ఆ యింట్లో పిల్లలొకటిగాదు, గడియారంలో ముళ్ళొకటి గాదు, ఎక్కడివాళ్ళక్కడ 'కీ' యిచ్చి వదిలిపెట్టిన మరబొమ్మల్లా మసలుకోవలసిందే! ఎటొచ్చీ మామయ్య విషయంలో మాత్రం కమలమ్మత్త తన నియమాల నన్నింటినీ సడలించి పారేసింది. మామూలు మనుషులకులేని కొన్ని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, కొంతడబ్బు వెచ్చిస్తే గానీ సమకూరని వినోద విలాసాలు ఒక ఆఫీసరుగారికి అందుబాటులో వుండాలన్న విషయంపట్ల ఆమె తన పూర్తి ఆమోదాన్ని ప్రకటించింది.

ప్రభుత్వ వ్యవహారాలన్నింటిలోనూ కీలకమైనది 'హెూం డిపార్టుమెంటు'. దీనికి సంబంధించి, రక్షణ ఏర్పాట్ల విషయంలో కమలమ్మత్త అలివిమాలినంత శ్రద్ధ తీసుకుంది. గాదెల నిండుకూ ధాన్యాలుంటాయి. వాటిలో ఎలుకలూ, పందికొక్కులూ చేరకుండా వుండడం ముఖ్యం. మాటలతో గాకపోయినా, చేతలద్వారా ఆమె తనదైన ఈ యింగితాన్ని బంధువుల్లో ప్రతి ఒక్కరికీ తెలియజేయగలిగింది. స్వంత పనిమీద ఆ వూరికంటూ వెళ్ళి, వెళ్ళిన పనితొందరగా ముగిసి ప్రయాణానికి కొంత వ్యవధి వున్నప్పుడు ఏ బంధువుకైనా మామయ్య యింటికి వెళ్ళిరావాలని అనిపిస్తుంది. బంధుజనుల ఓపికను పరీక్షించదలుచుకున్నట్టుగా, ఆ యిల్లు పట్టణానికొక చివరగా వుంది. పూలూ పళ్ళూ కొనుక్కుని రిక్షా చేసుకుని వెళ్ళినంతదూరం వెళ్ళి, బంధువాయింటి గుమ్మంలో దిగుతాడు. ఏడెనిమిది గదులు, పెద్దహాలు, చుట్టూ పూలతోట, బాల్కనీ, కారుషెడ్డు, హంగులన్నింటితోను లంకంత యిల్లు. స్థానభ్రంశం పొందిన వస్తువులను ఎప్పటికప్పుడు సర్దిపెట్టే పనిమనుషులుండడంవల్ల ఆ యిల్లు నీటైన మ్యూజియంలా కానరావడంలో ఆశ్చర్యమేమీలేదు. ద్వారం దగ్గర అలికిడికాగానే హాల్లో వున్న పిల్లలు కనురెప్పలు మాత్రం పైకెత్తి ఆగంతకుడివైపు చూస్తారు. చెరువులో గులకరాయి పడినంత స్వల్ప సంచలనం. ఎంతసేపు వేచి చూచినా అంతకుమించిన సంచలనం పొడసూపకపోయేసరికి, నిల్చోగలిగినంతసేపు నిల్చుని బంధుసత్తముడు చివరికొక కుర్చీలో కూచుంటాడు. కొద్ది నిమిషాలపాటు అలా మౌనముద్ర సాధన చేసిన తర్వాత తన ఆగమనవార్త యింటావిడకు తెలిసిందో, లేదోనన్న అనుమానంతో, వుండీ వుండి గొంతు సవరించుకుంటాడు. అప్పటికైనా 'రెస్పాన్సు' వుండడం సందేహమే! ఆఖరుకెప్పుడో, తనకేదో ఒక వస్తువు కావలసివచ్చి హాల్లోకి రావడం తటస్థించిన కమలమ్మత్త బంధువు వైపోసారి నిశ్చలంగా చూచి, ఆశ్చర్యంగానీ, ఆనందంగానీ, వ్యక్తంగాని మామూలు గొంతుకతో 'ఇదేనా రావడం' అంటుంది. దేనికోసమైతే వచ్చిందో ఆ వస్తువును తీసుకున్న తర్వాత హాల్లోనుంచీ లోపలికి

వెళ్ళిపోతూ 'మంచినీళ్ళు పుచ్చుకుంటారా' అంటుంది. బ్రాందీ, సారాల విషయంలో కొందరికి పట్టింపులుండొచ్చు. ఆరోగ్యానికి సరిపడని పరిస్థితుల్లో కొందరు కాఫీ, టీల విషయంలో గూడా అభ్యంతరం చెప్పవచ్చు. కానీ మానవ మాత్రులందరూ నిరాఘాటంగా ఆస్వాదింపదగిన (వలసిన) సాదా పానీయమేగదా మంచినీళ్ళు! ఆపాటి మంచినీళ్ళు తెచ్చి యివ్వడానికి తన పర్మిషన్ ఎందుకో తెలియక బంధువు బిక్కచచ్చిపోతాడు. గాలిగూడా స్తంభించిపోయినట్టున్న ఆ వాతావరణంలో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైపోతాడు. ఆఖరుకు సంచిలోనుంచి తాను తీసుకొచ్చిన పూలూ, పళ్ళూ పైకితీసే చొరవగూడా అతడికి లేకపోతుంది. ధైర్యం తెచ్చుకుని పైకిలేచి వెళ్ళొస్తానని తెలియజేస్తే ఒకవేళ యిల్లాలు 'ఎలాగూ రానేవచ్చారు. భోజనంచేసే వెళ్ళమని' సెలవిస్తే భగవంతుడా! ఇంకా రెండు మూడు గంటలపాటు ఈ మొదటి తరగతి జైలుశిక్ష అనుభవించడానికి తానేం నేరం చేసినట్టు? అంతకంటే ఎలా లోపలికి వచ్చాడో, అలాగే జారుకుంటే నయంకదూ?... ఇలా విచికిత్సలో పడ్డ తర్వాత ఆ బంధువరేణ్యుడు మెల్లగా పైకిలేచి, ఏదో పచారు చేస్తున్న వాలకంతో ప్రహరీగోడదాకా వచ్చి, అక్కడినుంచీ రంయిమంటూ రోడ్డుదారి పట్టితే అందులో ఆశ్చర్యపడవలసిందేమీ కనిపించదు.

బింకం చంపుకోలేక ఎవరో బంధువని అన్యాపదేశంగా చెప్తుకున్నానుగానీ, అలాంటి మర్యాదకు పాత్రులైన వారిలో (ఎంత దగ్గరి బంధువైనా) నేనూ ఒక్కణ్ణి గాకపోలేదు.

మళ్ళీ కొద్ది మాసాలు గడిచేలోగా ఎప్పుడైనా హఠాత్తుగా మా చిన్న మామయ్యతో తారసిల్లడం జరుగుతుండేది. ఒకవేళ అలా కలుసుకోవడం జరగకపోతే, క్యాంపుల మీద వూళ్ళు తిరుగుతూ వుండటంలో ఎలాగో వీలు చేసుకొని ఆయన మా యింటికే వచ్చివెళ్ళడం కద్దు. పట్నం తాతయ్య వచ్చాడంటే ఆ రోజు మా యింట్లో పిల్లలకందరికీ పండుగ. ఆయన పొట్లాలు పొట్లాలుగా బిస్కట్లు, పిప్పెరమెంట్లు తెస్తాడు. బుట్టలనిండుకూ పళ్ళు తీసుకొస్తాడు. ఆయన వున్నంతసేపూ మా యింటి వాతావరణంలో సముద్రానికి పోటు వచ్చినంత హంగామా.

"అమ్మాయ్, జానకీ! అదేమిటమ్మా, అలా చిక్కి చిక్కి నలికిరిలా తయారైపోయావు! వీడేమైనా నీ అతీగతీ పట్టించుకుంటున్నట్టా, లేనట్టా? సర్లే, వీడంతా వాళ్ళ పెద్ద మామయ్య చాలు. ఇద్దరికిద్దరే డబ్బు మనుషులు! వీడి జోలి నీకెందుకుగానీ, నువ్వు బయల్దేరి చక్కా నాతో వచ్చేసెయ్! రామారావు డాక్టరు దగ్గర పరీక్ష చేయించుకోడం మంచిది. మందులు, టానిక్కులు రాసిస్తే మళ్ళీ యిక్కడికొచ్చి కూడా పుచ్చుకోవచ్చు... ఒరేయ్, రాజశేఖరం! అమ్మాయిని పంపించరా, పదిరోజులుండి వస్తుంది గానీ!"... ఇదీ వరస.

ఉన్న మాట చెప్పుకోవాలి గదా! లోలోపల నాకు సంబరంగానే ఉండేది. మా జానకికున్న బంధుప్రేమకు తగిన జుల్మానా పదిరోజుల పర్యంతమైన మొదటి తరగతి జైలు శిక్షే!

"ఒరేయ్ రాజశేఖరం! నేనింతకాలంగానైతే ఊళ్ళు పట్టుకుని దేశంపైన తిరుగుతూ వుండిపోతిని. మీరుగూడా దూరాభారమని నన్ను వెదుక్కుంటూ రాకపోతిరి.

ఇప్పుడలాకాదుగదరా? ఇల్లూ వాకిలీ స్థిరంగా ఏర్పాటు చేసుకుని యిక మీదట యిక్కడినుంచీ కదలబోవడంలేదని భీష్మించుకున్నాను గదా! ఇప్పుడు మీరొచ్చి నాయింట్లో నాలుగు రోజులెందుకుండగూడదురా? ఛా, ఛా, ఏం నామర్దా రోజులొచ్చాయిరా బాబూ! మనుషుల మధ్య మమకారాలకే దరిద్రమొచ్చి పడిపోయింది గదరా పాడూ!"

అంతటి అచ్చమైన బంధు ప్రేమకు ముఖంవాచి వుంటుందేమో మా జానకి, కళ్ళల్లో గిర్రున తిరుగుతున్న కన్నీరు మాకెవ్వరికీ కనిపించకుండా ముఖాన్ని గోడవైపుకు త్రిప్పుకుని "ఈ బిడ్డల్ని వెంటబెట్టుకుని నాకు రావడమెక్కడ కుదురుతుందిలే బాబాయ్! అప్పుడప్పుడూ నువ్వొచ్చి చూచి పోతున్నావు కదా! అంతేచాలు" అనేది.

మామయ్య మా యింటికి వచ్చిన రోజున ఆయన వెంట వచ్చిన ఆఫీసు సిబ్బంది కంతటికీ ఆటవిడుపు. ఆయన గూడా ఉన్న కాసేపు ఆఫీసు గొడవలు మరిచిపోయేవాడు.

"ఒరేయ్ రాజశేఖరం! మా రాధమ్మ పిన్ని మనుమడు రామ్మూర్తి తెలుసునా నీకు? ఉద్యోగం లేకుండా తిరుగుతుండేవాణ్ణి నేనే మా డిపార్టుమెంటులో ఓ అటెండరు పోస్టులో దూర్చాను. ఆ మధ్య ప్రమోషనుగూడా వచ్చిందని వ్రాశాడు. వాడికిప్పుడో అమ్మాయి కావాలిట! నీ ఎరుకలో ఏదైనా సంబంధముంటే చెబుతావా"?

మా మామయ్య భోళాతనానికి నాకు నవ్వొచ్చేది. ఆయనకు పెళ్ళి కావలసి వున్న కూతుళ్ళు యిద్దరు ముగ్గురున్నారు. పెద్దమ్మాయికి ఎప్పుడో పదేళ్లకు మునుపే పెళ్ళి కావలసింది. రెండో అమ్మాయికిగూడా పెళ్ళి వయసు మీరిపోతున్నట్టే లెక్క. ఎటొచ్చీ మూడో అమ్మాయికి యిప్పుడిప్పుడే చేయకపోయినా ఫరవాలేదు. మగ పిల్లలకైనా సకాలంలో పెళ్ళిళ్ళు చేయవలసిందేనన్న పట్టింపు పెట్టుకుంటే మామయ్యగారి పెద్దబ్బాయి గూడా పెళ్ళిచేసుకోదగ్గ వయసులోనే వున్నాడు. పిల్లలేమైనా అనాకారులా అంటే అదేంకాదు. చూడముచ్చటగా వుంటారు. చదువుల్లో నంటేనా వాళ్ళు సిసింద్రీలు. పెద్దమ్మాయి ఒకటికి రెండు డిగ్రీలు తెచ్చుకొని లెక్చరరుగా పనిచేస్తోంది. రెండో అమ్మాయి ఎమ్మెస్సీలో క్లాసు తెచ్చుకుంది. పోనీ, పెళ్ళిళ్ళు చేయడానికి అవసరమైన స్థితిగతుల్లో మామయ్య కేదైనా లోపముంటే అది వేరే మాట! ఆ మాట చెప్పడానికి వీల్లేదు గదా! అన్ని లక్షణాలూ అమరికగానే వున్నా మామయ్య పిల్లలిలా పెళ్ళిళ్ళుగాకుండా వుండిపోవడం తలుచుకుంటే 'అంగట్లో అన్నీ వున్నా' అన్న సామెత మాత్రమే గుర్తుకొచ్చేది. ఏం లాభం? అల్లుడినోట్లో శని వుండిపోయాక!

"ఏం చెయ్యమంటావురా రాజశేఖరం!" అనేవాడు మామయ్య. "నాకు మాత్రం పెళ్ళిళ్ళు చేసెయ్యాలని లేదా? మీ అత్తయ్యదైతే ఒకటే పోరనుకో! ఏం చేద్దాం? దేనికైనా కాలం కలసిరావాలి గదా! కాలం కలిసిరావడమంటే గుర్తుకొచ్చింది. మా ఆఫీసులో కేశవులని ఒక జవాను. తన ఉద్యోగం తాను చేసుకుంటూ వాడు బుద్ధిగా వుండొచ్చుగదా! ఉండలా, అదొక మహత్కార్యమన్నట్లు చూచి చూచి ఓ అమ్మాయిని ప్రేమించేశాడు. తనకా అమ్మాయితో పెళ్ళంటూ జరక్కపోతే జగత్తుకంతా ప్రళయమొచ్చేస్తుందని వాడి నమ్మకం. సరే, ఆ హీరోయిన్ తండ్రి వున్నాడే, వాడిది పక్కా విలన్ పాత్ర. వాడు త్రాగుబోతు, జూదగాడు, చాలని దానికి తానున్న యిల్లుగూడా మూడువేలకు తనఖా పెట్టేశాడు.

మూడువేలిచ్చి ఆ యింటినెవడైతే తనఖానుంచీ విడిపిస్తాడో వాడు మాత్రమే తన కుమార్తెను పెళ్ళాడ్డానికి అర్హుడని ప్రకటన ఒకటి జారీచేశాడు. ఈ కేశవులు గాడెక్కడనుంచి తెస్తాడు మూడువేలు? నా దగ్గరికివచ్చి లబోదిబోమని మొత్తుకున్నాడు. నేనో కాగితం తీసుకరమ్మని చెప్పి కేశవులు పెళ్ళికోసం విరాళాలు అని హెడ్డింగు వ్రాసి, అందుకుగాను నా విరాళం మూడు వందలని వేసి, ఆ కాగితం వాడి చేతికిచ్చేశాను. వాడు టౌనుపైకి వెళ్ళొచ్చి ఆ సాయంకాలానికల్లా జాబితాలో మొత్తం అయిదువేలు దాటిందన్నాడు. డబ్బుకు దారి దొరికిపోయాక అడ్డేముంది? డోలుకొట్టడమేమో, తాళికట్టడమేమో! ఆ పెళ్ళికి మా ఆఫీసు స్టాఫంతా వెళ్ళొచ్చాము. ఇంతకంటే తమాషా యింకొకటి. శివసుందరరావని నాకు స్నేహితుడొకాయన వున్నాడు. రిటయరయ్యాడు. గుండెజబ్బొచ్చింది. మనిషి తిన్నగా నాలుగడుగులు నడవలేడు. ఇలాంటి పరిస్థితిలో అమ్మాయికి పెళ్ళి కుదిరింది. పెళ్ళన్నాక పదిచోట్లకు తిరిగి, పది మందితో మాట్లాడాలి గదా! తనకా ఓపికలేక డబ్బు మాత్రం తీసుకొచ్చి నా చేతికిచ్చేశాడు. మన వేంకటరమణస్వామి ఆలయంలోనే జరిగింది పెళ్ళి. ఫలానా వాళ్ళకు ఫలానా పని అని నిర్ణయించడం వరకే మనవంతు. దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలేనట! క్లబ్బు మెంబర్లు, ఆఫీసు ఉద్యోగులు, యింకా కొందరు స్నేహితులు అందరూ తలాఒక సాయం చేశారేమో, పెళ్ళి సవ్యంగా జరిగిపోయింది. అసలింతకూ చిత్రమేమిటంటే రాజశేఖరం, ఊళ్లో చాలామంది నేను నా కూతురికే పెళ్ళి చేస్తున్నానని అనుకున్నారు గూడా!"

చూచారా! ఇలా ఎంత సేపయినా జరిగిపోయిన పెళ్ళిళ్ళకు మేళాలు వాయించడమేగానీ, ఈయన జరగవలసిన వాటిని గురించి ఆలోచించడం వుండదు. చిరాకుతో ఒళ్ళు మండుకొచ్చి "ఇంతకూ వసంత పెళ్లిని గురించి నువ్వొక నిర్ణయానికి వచ్చేదెప్పుడు మామయ్యా?" అంటూ అడ్డుతగిలే వాణ్ణి.

"ఇందులో నేను తీసుకునే నిర్ణయమేముందిరా రాజశేఖరం?" దైన్యంగా ప్రశ్నించేవాడు మామయ్య, "వరుణ్ణి ఎన్నిక చేయవలసింది వసంత. సంబంధం తాలూకు మంచి చెడ్డల్ని బేరీజు వెయ్యవలసింది మీ అత్తయ్య. కాదంటే వాళ్ళ నాన్నగారు. తెలుసుగదా! మా మామగారు కచ్చితంగా జ్యోతిష్యశాస్త్రం ఒప్పుకుంటేగానీ సంబంధాన్ని రైటు చెయ్యడు. వచ్చిన సంబంధాలనన్నింటినీ జాబితాకట్టి చెబితే నోరు నొచ్చును. ఆదినుంచీ చంద్రమౌళి కివ్వాలనుకోవడం. ఎవడో దూరపు మనిషి గాకపోయె! స్వయంగా మీ అత్తయ్యకు చిన్నన్న కొడుకు. అల్లుడి హెూదాతో గాకపోయినా అంతటి చొరవతో యింటికొచ్చి వెళ్తుండేవాడు. హఠాత్తుగా ఏమొచ్చిందోగానీ, వాడు వెళ్ళి వెళ్ళి ఓ బెంగుళూరమ్మాయిని వరించేశాడు. పోతేపోయిందని వెళ్ళి గుండ్లూరు సంబంధం తీసుకొచ్చాను. వాళ్ళొకసారి వచ్చి చూచి వెళ్లారు. మళ్ళీ జవాబు రాయడమే మానుకున్నారు. ఆ తరువాత రాఘవయ్యగారని ఒకాయన రంగంలో దిగాడు. ఆయన కొడుకున్నూ ఎం.ఎ., దాకా చదువుకున్నవాడే! హైద్రాబాదులో ఉద్యోగమట. పెళ్ళి కాగానే అమ్మాయి తన ఉద్యోగానికి 'రిజైన్' చేసి హైదరాబాద్ వచ్చేయవలసి వుంటుందన్నాడు. అక్కడేదైనా కాలేజీలో చేర్పించడం తన చేతనౌనన్నాడు. "నా జీతం మీదనేగదా వాళ్ళకు మోజు. ఈ

సంబంధానికి నేనొప్పుకోననేసింది వసంత. ఇంకొకతను వచ్చాడు. డాక్టరు, కాస్త ముదురు మనిషిలా కనిపించాడు. ఫరవాలేదు లెమ్మని సరిపెట్టుకోజూచాం. ఇంకానయం! పత్రికలచ్చేయడం కోసం ప్రెస్సుకు బయల్దేరబోతుండగా అతడు రాసిన వుత్తరం చేతికొచ్చింది. ప్రయివేటు ప్రాక్టీసులో తాను నెలకొక వెయ్యి రూపాయలదాకా సంపాదిస్తున్నాడట! "మీ అమ్మాయికి ఉద్యోగపు బాదరబందీలేవీ వుండనక్కర్లేదు. ఇంటిపట్టునవుండి వంటచేసి పెడితే చాలు'నని వ్రాశాడు. నేనింత చదువు చదివింది వంటలక్క ఉద్యోగానికా? నని వసంత మొరాయించుకుని కూచుంది. ఈలోగా వేకన్సీ వుందని తెలిసిన చోటికల్లా అప్లికేషన్లు రాసి పడేసినట్టు యిద్దరు ముగ్గురు నిరుద్యోగులుగూడా అమ్మాయిని చూచిపోవడానికొచ్చారు. వాళ్లకు వంటచేయడం చేతనౌతుందేమో తెలుసుకోమంది అమ్మాయి......"

"పోనీ, ఒప్పుకుందాం. అమ్మాయిని నిరుద్యోగికివ్వడం కుదరదు. కానీ మొన్నటికి మొన్న ఎవరో ఇంజనీరు వచ్చి వెళ్ళాడుగదా! అమ్మాయి ఉద్యోగంచేస్తే చేయనివ్వు. మానుకుంటే మానుకోనివ్వు! వివాహం కాగానే కొత్త కాపురానికి వచ్చినాసరే! లేకుంటే అప్పుడప్పుడు నేనే వచ్చి వెళ్తాను అంటూ అతడు హిరణ్యాక్షవరాల కన్నింటికీ ఒప్పుకున్నాడట గూడా! పాపం అతడిమీదనైనా పెద్ద మనసుపెట్టి వుండగూడదా మామయ్యా?"

"అవునవును. ఆ కుర్రాడేమో నాకున్నూ నచ్చాడు. మీ అత్తయ్య గూడా 'పోనీ, యిచ్చేద్దాములెండి" అనేసింది. కానీ మా మామగారొప్పుకోలేదు! ఆయన కొత్తకోట శాస్త్రుర్ల దగ్గర జాతకాలు చూపించుకొచ్చి ఈ సంబంధానికి రజ్జు పొంతనాలు చాలడం లేదన్నాడు..."

"అంతకు మునుపు కొన్ని సంబంధాలకు జంతుపొంతనం కుదరడంలేదని చెప్పలేదా మామయ్యా?"

"అవున్రా? వరుడి పేరుకు పిల్లి. వధువు పేరుకు ఎలుక తగిలితే యింకేమైనా వుందా? పిల్లి ఎలుకను గుటుక్కున మింగెయ్యదూ?"

సూటిగా గురిపెట్టకుండా, యిలా గాలిలోకి తూటాలు ప్రేల్చినట్టుగా సాగేది మామయ్య ప్రసంగం. అమ్మాయి పెళ్ళి విషయంలో జాప్యం జరగడానికి ఆయన చెబుతున్న కారణాలు ఇంటిలో పారవేసుకున్న వస్తువును వీధిలో వెతకడంకన్నా సబబైనవి కావని నాకు తెలుసు. ఎవరి పిల్లల్ని వారు గారాబంగానే చూచుకోవచ్చు. కాని ముదిగారం మరీ ఎక్కువైనప్పుడు పిల్లలకు తమపట్ల తమకు చాలా పెద్ద అభిప్రాయం ఏర్పడిపోతుంది. వాళ్ళ దృష్టికి ఇతర మానవులందరూ ఎంతో క్షుద్ర జీవుల్లా కానవస్తారు. ప్రేమ గ్రుడ్డిదైనా చాలా సందర్భాల్లో అది మనిషికి మేలే చేస్తుంది. స్వాతిశయం చూపును, గుండెను గూడా కుంచింపజేసి హాని కలిగిస్తుంది. మా కమలమ్మత్త తన పిల్లలకు మనుషులపట్ల వెగటు కలిగించుకోడమెలాగో, మానసికంగా వాళ్ళను కొన్ని ఆమడల దూరంలో వుంచడమెలాగో నేర్పడంలో కృతకృత్యురాలైంది. ఆ భావనలో తల మునకలైపోయాక ఆమె కూతుళ్ళకు తామొక కొత్తచోటికి వెళ్ళి కొత్త మనుషుల మధ్య మసలుతూ ఆ

యింటి కోడళ్ళుగా వ్యవహరించటమనేది ఒక ఊహకందని విషయంగా వుండిపోయింది. అలాకాదని నా అన్నవాళ్ళెవరూ లేని స్వయంభువులాంటి విశిష్ట వ్యక్తి ఎవడైనా తారసిల్లితే ఏవో కారణాలు పుట్టించి ఆ సంబంధాన్ని వీగి పోగొట్టడానికి ఈ మామగారనే ముసలాయన ఒకడు దాపురించాడు. మనుమరాళ్ళకు పెళ్ళికాగూడదన్న దురుద్దేశం ఆయనకుండకపోవచ్చు. కానీ అసంకల్పిత ప్రతీకార చర్యలాంటిది యిందుకు కారణమై వుండొచ్చునేమోనని నా అనుమానం. ఒడిదుడుకులతో, భంగపాట్లతో జీవితాన్ని ఒక ఎడారి పయనంలా గడిపిన ఆ మామగారికి అల్లుడి యిల్లు ఒక చల్లటి నీడలా ఆశ్రయమిచ్చింది. ఈ పచ్చని పట్టుపైన తనకు పరోక్షంగా గల అధిపత్యాన్ని ఎవరో ఒక క్రొత్త వ్యక్తి అల్లుడిహోదాతో వచ్చి దోచుకోవడం ఆయన కిష్టంగాకపోయి వుండొచ్చు.

ఎంతగా బదిలీ వద్దనుకున్నా మా రంగనాథం మామయ్యకు స్థానచలనం తప్పిందిగాదు. ఉద్యోగ జీవితంలో, ఆ మాటకొస్తే జీవితంలో గూడా చివరి రెండేళ్ళు ఆయన మా కందరికీ వందమైళ్ళ దూరంలో వుండిపోయాడు. ఆ రెండేళ్ళ వ్యవధిలో నేనొక్కసారి మాత్రం ఆయనను కలుసుకోగలిగాను. ఒక పెళ్ళి సందర్భంలో కలుసుకుని కాసేపట్లో విడిపోయాము. డబ్బున్నచోట ఖరీదైన జబ్బులు కొన్ని మూగడం కద్దు. మా మామయ్యకు గూడా ఆదినుంచీ అంతో యింతో అలాంటి జబ్బుల తాకిడి లేకపోలేదు. పైపెచ్చు యింటి నుంచి దూరంగా వుండవలసి వచ్చినందువల్లనేమో, ఆయన బాగా డస్సిపోయినట్టు కనిపించాడు. అయితే అన్ని కారణాలూ ఒక్కుమ్మడిగా చేరి యింత అర్థాంతరంగా ఓడను ముంచేస్తాయని నేననుకోలేదు. ఉన్నట్టుండి ఓ రోజున టెలిగ్రాం చేతికందింది...

❁ ❁ ❁ ❁

పెద్ద దిక్కు పోయాక కుటుంబాని కెదురయ్యే దైన్యానికి బంధువుల ఓదార్పుకన్నా మించిన ఔషధం వుండదేమో! ఆ వుద్దేశ్యంతోనే మామయ్య చనిపోయిన కొత్తలో నేను నాలుగైదు సార్లు ఆ ఇంటికి వెళ్ళడమంటూ జరిగింది. బల్బులు, ఫ్యాన్లు, రేడియోలు యిలా ఎన్ని హంగులున్నా విద్యుత్ప్రవాహం ఒకటి ఆగిపోతే ఎలా వుంటుందో, అలా ఆ యిల్లంతటా స్తబ్దత పేరుకుపోయినట్టు తోచింది. బాహ్య ప్రపంచంలో నుంచీ మనుషుల రాకపోకలు బాగా తగ్గి పోయాయేమో, బంధువైన వాడెవడైనా కనిపిస్తే ఆ యింటిలోని చిన్నపిల్లలు వులిక్కిపడి, మాటాడదామా వద్దా అని కొద్ది క్షణాలు తటపటాయించి, చివరికెలాగో తెంపు తెచ్చుకుని ఒకటి రెండు మాటలద్ధాకా మాటాడ్డానికి నేర్చుకుంటున్నారు. కానీ ఈ చైతన్యం యింజనులోనుంచీ శబ్దం మాత్రమే వినవచ్చి, కదలిక మాత్రం లేకుండా రోడ్డుపైన ఆగిపోయిన వాహనాన్ని తలపిస్తుంది. మరైతే ఈ వాహనం కదిలేదెప్పుడు?

వయసులో ముప్పై యేళ్ళకు తగ్గకుండా ఏ డాక్టరో, ఇంజనీరో, అథవా ఏ లెక్చరరో అయినవాణ్ణి వెదికి తీసుకొస్తే పెద్దమ్మాయి పెళ్ళికొప్పుకోవచ్చు. కానీ అంత చదువూ చదివి, ఆపాటి ఉద్యోగమూ చేస్తున్నవాడు యింకా అవివాహితుడుగా పడివుంటాడా? ఈపాటికే ఏ ఆడబిడ్డల తండ్రో అతణ్ణి ఎగరేసుకపోయి వుండడూ?

వివాహమనేది జీవితంలో ఒకపెద్ద మలుపు. రైలెక్కి యిదివరకెన్నడూ వెళ్ళని కొత్త ప్రాంతాలకు వెళ్ళి, కొత్త అనుభవాలను చవిచూడడం లాంటిది. నువ్వు స్టేషనుకు వెళ్తావు. వచ్చిన బండ్లనన్నింటినీ విడిచిపెట్టేస్తావు. ఇప్పుడే రైలూ నీకోసం ఆగడంలేదు. నీకెలా వుంటుంది. వుక్రోషంగా వుంటుంది. ఏడుపొస్తుంది. బుద్ధి మాటలు చెప్పి సకాలంలో రైలెక్కించని వాళ్ళని కసిదీరా తిట్టాలని వుంటుంది...

పెళ్ళి లేకపోతేనేమి, నేను బ్రతికినంతకాలం బ్రహ్మచారిణిగానే వుండిపోతాను అంటుందట వసంత. మా కమలమ్మత్త చెబుతుంటుంది.

మరైతే రెండో అమ్మాయి దగ్గరనుంచీ మొదలుపెట్టి పెళ్ళిళ్ళు జరిపించవచ్చు గదా! ఈ ప్రతిపాదన తల్లికి యింపితంగా వుండడం సందేహమే!

అక్కయ్య పెళ్ళిగాకపోవడంలో తన బాధ్యత ఏముంది? ఎంతగా ఒకే కడుపున పుట్టినా అక్క చెల్లెళ్ళలో ఒకరికోసం ఒకరు తాము కోరుకునే సుఖాలనుంచీ దూరం కావలసిన అగత్యమేముంది... అన్న ఊహ రెండో అమ్మాయికి కలగకపోతేనే మనం ఆశ్చర్యపడాలి...

చదువులు పూర్తిచేసి, ఉద్యోగంలో ప్రవేశించి, వివాహానికన్ని విధాలా అర్హుడైవున్న మామయ్యగారి పెద్దబ్బాయి మాత్రం అక్క చెల్లెళ్ళకోసమని ఎంతకాలం తన పెళ్ళిని వాయిదా వేసుకుంటాడు?

పరస్పర విరుద్ధమైన ఊహలతో, అభిప్రాయాలతో ఆ యింట్లో ఒక ప్రచ్ఛన్నయుద్ధం జరుగుతున్నట్టే వుంటుంది.

ఇలా తలపోతలతో తల మునకలై కూర్చున్నానేమో, ఓరోజు మధ్యాహ్నం మా మామయ్యగారింట్లో నాకు మతిపోయినంత పనైంది. ఉదయం పది గంటలకనగా నేనక్కడికి వెళ్ళాను. కమలమ్మత్త 'ఫరవాలేదు, భోజనం చేసి వెళ్ళ'మనడంతో పంజరంలో చిలకలా చిక్కుబడిపోయాను. ఏకాంక నాటికకోసం తయారుచేసిన స్టేజిలాంటి హాల్లోకి పాత్రలేవో ప్రవేశించి, తమ యిచ్ఛవచ్చినట్లు నటించి తిరిగి లోపలికో, బయటికో వెళ్ళిపోతుంటే చూస్తున్నాను. కూనిరాగాలు, ట్రాన్సిస్టరులో నుంచి హిందీ సినిమా పాటలు, 'ఛేజ్' నవలలు, ఎవరో అంతర్జాతీయ ప్రసిద్ధి పొందిన స్వాములవారి ఉపదేశం మేరకు 'మెడిటేషన్లు' మొదలైనవి తప్పితే మనసారా ఒకరితో ఒకరు మాట్లాడుకోడంగానీ, గుండె తేలికయ్యేటట్లుగా నవ్వుకోడంగానీ లేని ఆ బరువైన వాతావరణంలో నా తల దిమ్మెక్కిపోయింది. గోడ గడియారం టిక్కు టిక్కు మంటున్న సవ్వడి తలపైన సమ్మెటతో బాదినట్టు ఎడతెరిపి లేకుండా వినిపిస్తోంది. కూర్చోగలిగినంతసేపు కూర్చుని కిటికీలు మూసి ముంతపొగ పెట్టిన గదిలోనుంచి తలుపు బద్దలుగొట్టుకుని బయట పడినట్టుగా నేను రోడ్డుపైకి వచ్చేశాను. ఎండాకాలం గంట మూడు కావస్తోంది. ఆరింటికిగానీ మా వూరికి బస్సులేదు. ఆలోగా నేను చక్కబెట్టుకోవలసిన పనులున్నా లేవు. ఊరికే పురవినోదాలు చూస్తూ ఒళ్ళలిసిపోయేలా రోడ్లపైన తిరిగాను. ఓ మూడు రోడ్ల కూడలి దగ్గరికి వచ్చేసరికి నా పాదాలు అప్రయత్నంగా ఆగిపోయాయి. రోడ్డులేని వైపున పేవ్‌మెంట్‌పైన టౌన్ బస్సు నిమిత్తం వేచివుండే ప్రయాణీకులకోసమని నిర్మించిన

వెయిటింగ్ షెడ్ ఒకటి. వెనుకవైపున ఒక ప్రహరీగోడ. ముందూ వెనుకా దృఢమైన స్తంభాలు. కమ్ములతో, కాంక్రీటుతో దిట్టమైన పైకప్పు. క్రింద సిమెంటు బెంచీలు, ఆ చల్లటి పట్టు నాకు ఎడారిలో చిన్న ఒయాసిస్సులా కానవచ్చింది. అయితే తిరిగి తిరిగి ఆఖరుకు గమ్యస్థానం చేరుకున్నానన్న సంతృప్తి కలిగినందుకు అది ఒయాసిస్సులా కానవచ్చింది. అయితే తిరిగి తిరిగి ఆఖరుకు గమ్యస్థానం చేరుకున్నానన్న సంతృప్తి కలిగినందుకు అది ఒయాసిస్సులా కానరావడమొక్కటే కారణం గాదు. అందుకు కారణం షెడ్డు తాలూకు పైకప్పు అంచు పొడుగునా కానవచ్చిన అక్షరాలు. కీ.శే.రంగనాథంగారి జ్ఞాపకార్థం ఫలానా క్లబ్బువాళ్ళు దాన్ని కట్టించారన్న వివరణ.

నిజం చెప్పొద్దూ! ఆ నీడలోకి వెళ్ళేసరికి "ఏరా అబ్బాయ్! బాగున్నావా?" అంటూ మా చిన్న మామయ్య పలకరిస్తున్నట్లే తోచి నా శరీరం పులకించింది. మామయ్య సౌజన్యం ఆఖరుకిలా రూపుకట్టిందా అనుకునే సరికి కనుకొలుకుల్లో రెండు కన్నీటి ముత్యాలుగూడా నిలిచాయి. బాగుంది! ఇదే బాగుంది! అవధుల్లేని మామయ్య మంచితనంలాగే ఈ వెయిటింగ్ షెడ్‌కు గూడా అడ్డుగోడలు లేవు. ఎండలోపడి నడిచి వచ్చిన వాళ్ళు – వాళ్ళు ముసలివాళ్లయినాసరే, పసిపాపలైనాసరే, పురుషులైనా సరే, స్త్రీలయినా సరే, మతం మాట తలవొద్దు కులం మాట ఎత్తడానికే వీల్లేదు; ఎవరైనా సరే యిక్కడ కాసేపు సేదదీరవచ్చు. ప్రపంచమే ఒక పాంథశాల అంటాడు ఉమర్ఖయాం! మరైతే 'ఆత్మ' పాలిటికి మనుగడమట్టుకు పాంథశాల గాకపోతుందా? మామయ్య జీవించినంతకాలం ఆయన సాన్నిహిత్యం ఆశ్రితులకు, మిత్రులకు, బంధువులకు ఆదరణ, ఆప్యాయత, అభిమానమూ పంచిపెడుతూ ఒక పాంథశాలలాగే నిలిచింది. చనిపోయిన తర్వాతగూడా ఆయన పేరిట ఒక పాంథశాల వెలసింది. జీవిత సార్థక్యత కింతకుమించి మరేం కావాలి?

❁ ❁ ❁ ❁

టౌనుకు వెళ్ళినప్పుడల్లా ఎన్ని తొందర పనులున్నా ఎలాగో వీలు చేసుకుని ఓ అయిదు నిమిషాలపాటయినా ఆ వెయిటింగ్ షెడ్డులో కూర్చుంటాను. తిరిగి వెళ్ళగానే "ఏమండీ! మా బాబాయిగారింటికి వెళ్ళొచ్చారా?" అని అడుగుతుంది జానకి. 'ఓ' అంటాను నేను. ఆమె నమ్మదు. నేను వివరించడానికి ప్రయత్నిస్తాను. తాను చెవిలో వేసుకోదు. 'పునరపి జననం, పునరపి మరణం, పునరపి జననీ జఠరేశయనం' అన్నట్టుగా అన్ని కథలూ మళ్ళీ ప్రారంభమైన చోటికే వచ్చి చేరుకుంటాయనిపిస్తుంది.

♦ *'భారతి' మాసపత్రిక, 1977* ♦